క్లుప్తంగా

నూతన పద్ధతులతో సాగు చేయాలి



మాట్లాడుతున్న సుబ్బారెడ్డి

నెల్లూరు(సెంట్రల్): నూతన పద్ధతులను తెలుసుకొని నిమ్మను సాగు చేస్తే మంచి లాభాలొస్తాయని ఉద్యాన శాఖ జిల్లా అధికారి సుబ్బారెడ్డి పేర్కొన్నారు. నగరంలోని ఆచార్య ఎన్జీ రంగ వ్యవసాయ పరిశోధన స్థానంలో నిమ్మ పంటపై ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. ఉద్యాన శాఖ అధికారులు లేదా శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పొందితే మంచి ఫలితం ఉంటుందని చెప్పారు. శ్రీనివాసులు, శాస్త్రవేత్త మధుమతి తదితరులు పాల్గొన్నారు.

వేదగిరిలో తిరుప్పావై సేవ



నెల్లూరు సిటీ: నరసింహకొండలో వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో పంచామృతాభిషేకం, తిరుప్పావైసేవను మంగళవారం నిర్వహించారు. ఈఓ వేమూరి గోపీ, ప్రధానార్చకుడు భాస్కరాచార్యులు, అర్చకులు కృష్ణమాచార్యులు, మురళీధరాచార్యులు, అప్పలాచార్యులు, రాఘవాచార్యులు పాల్గొన్నారు.

అశోక్‌కు ఎమ్మెల్సీ పరామర్శ



నెల్లూరు(బారకాసు): అనారోగ్యానికి గురై నగరంలోని మెడికవర్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 14వ డివిజన్ నేత సింగంశెట్టి అశోక్‌ను ఎమ్మెల్సీ, పార్టీ నెల్లూరు సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. మెరుగైన వైద్యాన్ని అందించాలని డాక్టర్లకు సూచించారు. పార్టీ యువజన విభాగ జిల్లా అధ్యక్షుడు, కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జున, నేతలు గిరిరెడ్డి, సాకేష్ రెడ్డి, మహేష్, సలామ్, అస్లామ్ పాల్గొన్నారు.

⇨ మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిని నగరంలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో చంద్రశేఖర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.

రాజరాజేశ్వరి ఆలయంలో బహిరంగ వేలం



నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో వివిధ లైసెన్స్ హక్కులకు ఈ – టెండర్, సీల్డ్ టెండర్, బహిరంగ వేలాన్ని మంగళవారం నిర్వహించారు. గాలి గోపురం ముందువైపు పుష్పాలు విక్రయించుకునే హక్కు, ఫ్లెక్స్, బ్యానర్లను ఏర్పాటుచేసేందుకు సంబంధించిన టెండర్లు ఖరారయ్యాయని ఈఓ కోవూరు జనార్దన్‌రెడ్డి తెలిపారు. కొబ్బరికాయలు, పూజా ద్రవ్యాల విక్రయం తదితరాలకు సరైన వేలం రాకపోవడంతో వీటిని ఈ నెల 25కు వాయిదా వేశామన్నారు. పర్యవేక్షణాధికారిగా పూడిపర్తి గ్రూప్ టెంపుల్స్ ఈఓ శ్రీధర్‌నాయుడు వ్యవహరించారు. ప్రధానార్చకుడు సూరావఝ్జుల రఘురామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన



నెల్లూరు సిటీ: కలివెలపాళెం, మాదరాజుగూడూరులో రూ.55 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లకు సంబంధించిన శంకుస్థాపనను నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మంగళవారం చేపట్టారు. టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

28 నుంచి జాతీయ ఫెస్ట్



నెల్లూరు (టౌన్): నగరంలోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ ఫెస్ట్‌ను ఈ నెల 28, మార్చి ఒకటిన నిర్వహించనున్నామని ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను కళాశాలలో మంగళవారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. ప్రదర్శనలో విజేతలకు సర్టిఫికెట్లతో పాటు బహుమతులను అందజేయనున్నామని చెప్పారు.

ఉచిత ఆర్థోపెడిక్ పరీక్షలు

నెల్లూరు(అర్బన్): వయస్సు పైబడి మోకాలి నొప్పులతో బాధపడే వారి కోసం తమ ఆస్పత్రిలో ఆర్థోపెడిక్ పరీక్షలను ఈ నెల 28 వరకు ఉచితంగా నిర్వహించనున్నామని మెడికవర్ సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రి సెంటర్ హెడ్ డాక్టర్ ధీరజ్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆస్పత్రిలో విలేకరుల సమావేశంలో మంగళవారం ఆయన మాట్లాడారు. డాక్టర్ కన్సల్టేషన్, ఎక్స్‌రేలతో పాటు అవసరమైన ఇతర పరీక్షలను ఉచితంగా చేయనున్నామని చెప్పారు. మోకాలి కీలు మార్పిడి చేయాల్సి ఉంటే అధునాతన పద్ధతుల్లో తక్కువ ఫీజుతోనే సర్జరీని చేయనున్నామని పేర్కొన్నారు.

సుందర సింహపురి ఇదేనా..?

- నగరంలో పేరుకుపోతున్న వ్యర్థాలు
- ఖాళీ స్థలం కనిపిస్తే యథేచ్ఛగా డంప్ చేస్తున్న వైనం
- విజృంభిస్తున్న దోమలు

నెల్లూరు (పొగతోట): నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు సింగపూర్ తరహాలో మారుస్తామంటూ గత ఎన్నికలకు ముందు టీడీపీ నెల్లూరు సిటీ నియోజకవర్గ అభ్యర్థి హోదాలో ప్రస్తుత మంత్రి నారాయణ హామీలిచ్చారు. అయితే ప్రస్తుతం ఆ మాట అటుంచితే నగరం దుర్భరంగా మారుతోంది. ఖాళీ స్థలం కనిపిస్తే వ్యర్థాలను పలువురు ఇష్టానుసారంగా డంప్ చేస్తున్నారు. ఈ తరుణంలో దోమలు విజృంభిస్తూ ప్రజలకు కంటిమీద కునుకు కరువవుతోంది.

పారిశుధ్యం అస్తవ్యస్తం

నగరాన్ని సుందరవనంగా తీర్చిదిద్దుతామనే మాట ఆచరణలో ఏ మాత్రం కానరావడంలేదు. కొబ్బరి బోండాలు, మాంసపు వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడే వేస్తున్నారు. దోమల మోతతో ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నారు. నగరంలోని 54 డివిజన్లలో పరిస్థితి ఇదే తరహాలో ఉందంటే సమస్య తీవ్రత ఏమిటో అర్థం చేసుకోవచ్చు. ఎన్టీఆర్‌నగర్, వెంకటేశ్వరపురం, అయ్యప్పగుడి, కొత్తూరు, తల్పగిరి కాలనీ తదితర ప్రాంతాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంది. దుర్గంధం వెదజల్లుతుండటంతో ముక్కుమూసుకొని మరీ ప్రజలు రాకపోకలు సాగించాల్సి వస్తోంది.



ఎన్టీఆర్‌నగర్‌లో రోడ్డు పక్కన పేరుకుపోయిన కొబ్బరి బోండాలు

దోమల బెడద అధికంగా ఉంది

“ నగరంలో దోమల బెడద అధికంగా ఉంది. రాత్రీ, పగలనే తేడా లేకుండా స్వైరవిహారం చేస్తున్నాయి. ఆలౌట్ పెట్టినా వీటి బెడద నుంచి తప్పించుకోలేక పోతున్నాం. వ్యర్థాలను నగరపాలక సంస్థ తొలగించి దోమల నివారణకు చర్యలు చేపట్టాలి.

– పద్మనాభరావు, రిటైర్డ్ టీచర్

చెత్త తొలగింపులో నిర్లక్ష్యం

చెత్తను తొలగించే అంశంలో పారిశుధ్య సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. టీడీపీ నేతలు, బడాబాబులుండే ప్రాంతాల్లోనే శుభ్రతను పాటించి మిగిలిన చోట్లను విస్మరిస్తున్నారనే విమర్శలూ ఉన్నాయి. ఫలితంగా ఆయా ప్రాంతాల్లో చెత్త పేరుకుపోతోంది. కార్పొరేషన్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించకపోవడం సైతం సమస్యకు ఓ కారణమవుతోంది. ఇప్పటికైనా స్పందించి సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కూచిపూడిలో రాణిస్తూ..

- చిన్న వయస్సులోనే రిషికేష్ ప్రతిభ
- ఇప్పటికే అనేక చోట్ల ప్రదర్శనలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): శాస్త్రీయ నృత్యం నేర్చుకునే వారి సంఖ్య నానాటికీ పెరుగుతోంది. బాలికలు అధికంగా ఆసక్తి చూపుతున్నారు. అక్కడక్కడా బాలురు కూడా నేర్చుకొని రాణిస్తున్నారు. నెల్లూరుకు చెందిన ఓ బాలుడు కూచిపూడి నృత్యం అభ్యసించి ప్రదర్శనలిచ్చే స్థాయికి ఎదిగారు. నగరంలోని పొదలకూరురోడ్డు ప్రాంతానికి చెందిన దాసరి శ్రీకాంత్, లావణ్య దంపతుల సంతానమైన రిషికేష్ ఆరో తరగతి చదువుతున్నారు. తన పెద్దమ్మ చెన్నారెడ్డి జ్యోత్స్నరెడ్డి, ఆమె కుమార్తె శరణ్యారెడ్డి కూచిపూడి నృత్య కళాకారులు. రిషికేష్ వీరిని స్ఫూర్తిగా తీసుకున్నారు. తన పెద్దమ్మ నిర్వహిస్తున్న శ్రీనందికేశ్వర కూచిపూడి కళాక్షేత్రంలో నాట్యం నేర్చుకున్నారు. ఓవైపు చదువుకుంటూనే మరోవైపు ప్రదర్శనలిస్తున్నారు.

ఎన్నో చోట్ల..

రిషికేష్ ఇప్పటికే అనేక చోట్ల ప్రదర్శనలిచ్చారు. తిరువనంతపురంలోని అనంత పద్మనాభస్వామి ఆలయం, శ్రీకాళహస్తి, శ్రీశైలం తదితర పుణ్యక్షేత్రాల్లో కూచిపూడి నృత్యం చేసి ఆకట్టుకున్నారు. జిల్లాలో నిర్వహించిన బాలోత్సవాలు, రాయలసీమ రంగస్థలి వారు నిర్వహించిన పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచారు. నెల్లూరు నృత్యభూమి వారు నిర్వహించిన పోటీల్లో ద్వితీయ స్థానాన్ని సాధించారు. సత్యనారాయణ ఆరోగ్యాలయంలో ఏర్పాటు చేసిన పోటీల్లో ప్రదర్శన ఇచ్చి ఆహూతుల మన్ననలు పొందాడు. విదేశాల్లో ప్రదర్శనలివ్వడమే తన ప్రధాన లక్ష్యమని చెప్తున్నారు.



నృత్య ప్రదర్శనలో రిషికేష్

డ్రోన్ సర్వేను విజయవంతం చేద్దాం

నెల్లూరు(బారకాసు): అధునాతన డ్రోన్ విధానం ద్వారా నగరపాలక సంస్థ పరిధిలో నిర్వహించనున్న సర్వేతో ఎన్నో ఉపయోగాలున్నాయని, అందరి సహకారంతో దీన్ని విజయవంతం చేయాలని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పిలుపునిచ్చారు. నేషనల్ జియోస్పేషియల్ నాలెడ్జ్ బేస్డ్ ల్యాండ్ సర్వే ఆఫ్ అర్బన్ హ్యాబిటేషన్స్ కార్యక్రమాన్ని నగరపాలక సంస్థ కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో మంగళవారం ప్రారంభించారు. డ్రోన్ సర్వే పనితీరును సాంకేతిక విభాగ బృందాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివిధ అంశాలను నిర్వాహకులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పైలట్ ప్రాజెక్ట్‌గా కార్యక్రమాన్ని కార్పొరేషన్ పరిధిలో నెల పాటు నిర్వహించనున్నారని వివరించారు. అనంతరం కమిషనర్ సూర్యతేజ మాట్లాడారు. నక్ష సర్వే ద్వారా పట్టణ భూ రికార్డులను పూర్తిగా డిజిటలైజ్ చేసి జీఐఎస్ మ్యాప్ చేయనున్నారని తెలిపారు. అదనపు కమిషనర్ నందన్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ తహసీన్, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, సిటీ ప్లానర్ హిమబిందు, డీసీపీ పద్మజ తదితరులు పాల్గొన్నారు.



సాంకేతిక నిపుణుల ద్వారా వివరాలు తెలుసుకుంటున్న అధికారులు తదితరులు

‘డీకేడబ్ల్యూ’లో సర్టిఫికెట్ కోర్సు

నెల్లూరు (టౌన్): నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ డొమెస్టిక్ నాన్ వాయిస్ అనే సర్టిఫికెట్ కోర్సును ఏపీఎస్సెస్డీసీ ఆధ్వర్యంలో ప్రారంభించనున్నామని ప్రిన్సిపల్ గిరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోర్సులో 30 సీట్లున్నాయని, 18 నుంచి 35 ఏళ్లలోపు ఉండి పదో తరగతి లేదా ఆపై చదివిన మహిళలు అర్హులని చెప్పారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్, ఉద్యోగాన్ని కల్పించనున్నారని, వివరాలకు 86398 67407 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

పెద్దాస్పత్రిలో అన్నదానం

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని పెద్దాస్పత్రిలో గల సత్యసాయి సేవా ట్రస్ట్‌లో అన్నదానాన్ని వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. మాజీ ప్రెసిడెంట్ సుబ్బరాజు తండ్రి ఓబుల్‌రాజు వర్ధంతిని పురస్కరించుకొని కార్యక్రమాన్ని చేపట్టారు. అసోసియేషన్ అధ్యక్షుడు చింతల అమరేంద్రరెడ్డి, కార్యదర్శి పొన్నం రవిచంద్ర, మాజీ సెక్రటరీ స్వర్ణ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పన్ను బకాయిల వసూళ్లు వేగవంతం

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలో పన్నుల బకాయిల వసూళ్లను వేగవంతం చేయాలని డిప్యూటీ కమిషనర్ చెన్నుడు ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్‌లో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎనిమిదేళ్లుగా బకాయిలున్న యజమానులను కలిసి వసూలు చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పర్యటించాలని సూచించారు. స్థానికంగా అందుబాటులో లేని వారిని ఫోన్ ద్వారా సంప్రదించి ఆన్‌లైన్లో చెల్లించేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. మార్చి 31 నాటికి లక్ష్యాలను నూరు శాతం సాధించాలని తెలిపారు. రెవెన్యూ అధికారి ఇనాయతుల్లా, సూపరింటెండెంట్ శ్రీనివాసులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చెన్నుడు

పోలీస్ పహారాలో ఆజాద్ సెంటర్

నెల్లూరు(క్రైమ్): నగరంలోని ఆజాద్ సెంటర్‌లో పోలీస్ పహారా కొనసాగుతోంది. ఈ ప్రాంతంలో వివేకానందుడి విగ్రహ ఏర్పాటు విషయమై వివాదం శనివారం అర్ధరాత్రి చెలరేగిన విషయం విదితమే. అప్రమత్తమైన పోలీస్, రెవెన్యూ అధికారులు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు చేపట్టారు. నగర, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది ఇలా 50 మందికిపైగా షిఫ్టుల వారీగా బందోబస్తు విధులు నిర్వర్తిస్తున్నారు. పలు దారులను మూసేసి, బ్యారికేడ్లను ఏర్పాటు చేసి రాకపోకలను నిషేధించారు. సెంటర్ చుట్టూ 100 మీటర్ల వరకు ఉన్న దుకాణాలను మూయించారు. దీంతో నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో కర్ఫ్యూ వాతావరణం నెలకొంది.



ఆర్‌ఐఓను కలిసిన నేతలు

నెల్లూరు (టౌన్): ఇంటర్ ప్రాక్టికల్స్‌లో కాంట్రాక్ట్ అధ్యాపకులకు సముచిత స్థానాన్ని కల్పించిన తరుణంలో స్టోన్‌హౌస్‌పేటలోని కార్యాలయంలో ఆర్‌ఐఓ ఆదూరు శ్రీనివాసులును ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపకుల అసోసియేషన్ నేతలు మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు కృతజ్ఞతలను తెలియజేశారు. కాంట్రాక్ట్ అధ్యాపకుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సునీల్, ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ కిరణ్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ గౌతమ్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులివ్వండి

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలో అపరిశుభ్రంగా ఉన్న ఖాళీ స్థలాలను గుర్తించి జంగిల్ క్లియరెన్స్ నిమిత్తం ఆయా స్థలాల యజమానులకు నోటీసులను జారీ చేయాలని కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. 26వ డివిజన్లోని చంద్రమౌళీనగర్, వేదాయపాళెం రైల్వేస్టేషన్ రోడ్డు, త్యాగరాజనగర్ తదితర ప్రాంతాల్లో మంగళవారం పర్యటించిన ఆయన మాట్లాడారు. ఖాళీ స్థలాల యజమానుల వివరాలను సంబంధిత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి సేకరించి, వారి ద్వారా జంగల్ క్లియరెన్స్ చేయించడంతో పాటు వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్‌ను వసూలు చేయాలని సూచించారు. రైల్వే ట్రాక్‌కు అనుసంధానంగా పచ్చదనాన్ని పెంపొందించడం, పారిశుధ్య నిర్వహణ, దోమలు వ్యాప్తి చెందకుండా చేపట్టాల్సిన చర్యలపై ఆ శాఖ అధికారులతో చర్చించాలని చెప్పారు. కాలువల్లో పూడికతీత, సిల్ట్ ఎత్తివేత పనులను నిరంతరం పర్యవేక్షించాలని కోరారు. విద్యుత్ స్తంభాలకు దీపాలను అమర్చడంతో పాటు అవసరమైన చోట హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేయాలని తెలిపారు. ఎంహెచ్‌ఓ చైతన్య, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, రెవెన్యూ అధికారి ఇనాయతుల్లా, వెటర్నరీ వైద్యుడు మదన్ మోహన్, ఉద్యానశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సూర్యతేజ

భక్తులకు ఇబ్బందులు తలెత్తకూడదు

నెల్లూరు(బృందావనం): నగరంలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థాన బ్రహ్మోత్సవాలను అధికార యంత్రాంగం సమన్వయంతో నిర్వహించాలని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆర్డీఓ అనూష పేర్కొన్నారు. ఈ నెల 21 నుంచి మార్చి ఐదు వరకు బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్న నేపథ్యంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశాన్ని మంగళవారం జరిపారు. తొలుత ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. డీఎస్పీ సింధుప్రియ, దేవదాయ శాఖ జిల్లా అధికారి కోవూరు జనార్దన్‌రెడ్డి, డీఎంహెచ్‌ఓ సుజాత, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఈఓ శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న అధికారులు

విద్యతోనే దేశాభివృద్ధి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): అన్ని వర్గాలకు విద్య చేరువైతేనే దేశాభివృద్ధి సాధ్యమని ఆవాజ్ జిల్లా కార్యదర్శి రషీద్ పేర్కొన్నారు. మినీబైపాస్ రోడ్డులోని భవన నిర్మాణ కార్మిక సంఘ జిల్లా కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని పలు పాఠశాలలు ఉపాధ్యాయుల్లేక, విద్యార్థులు రాక మూతపడుతున్నాయని చెప్పారు. మోడల్ స్కూళ్ల పేరిట మూడు, నాలుగు కిలోమీటర్ల దూరంలో పాఠశాలను ఏర్పాటు చేస్తే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురై, విద్యకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉర్దూ టీచర్లను నియమించాలని డిమాండ్ చేశారు. డీఎస్సీని వెంటనే ప్రకటించాలన్నారు. ఆవాజ్ జిల్లా అధ్యక్షుడు రఫీ, నేతలు శివకుమారి, మస్తాన్‌బీ, నరసింహ, జీవన్, నవీద్, రియాజ్, చాన్‌బాషా, జానీబాషా, మునీర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రషీద్

ఆర్పీఐ నూతన కార్యవర్గ ఎన్నిక

నెల్లూరు సిటీ: గాంధీబొమ్మ సమీపంలోని రెవల్యూషనరీ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్పీఐ) కార్యాలయంలో నూతన కార్యవర్గాన్ని నెల్లూరు జిల్లా అధ్యక్షుడు మాబూ అధ్యక్షతన మంగళవారం ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా పట్టపు రంగారావు, జిల్లా ఉపాధ్యక్షులుగా నేనావత్ రవినాయక్, ప్రసన్నకుమార్, మధు, మహదేవ, సుబ్బారావు, పోలయ్య, నౌషాద్, జిల్లా కార్యదర్శులుగా గంటా జాన్‌కిరణ్, వజ్జా సుధాకర్, ఒజిలి భాస్కర్, దాసరి రత్నం, నాగూర్ ఎన్నికయ్యారు. అదే విధంగా వివిధ పదవులకు పలువుర్ని ఎన్నుకున్నారు. నేతలు ఆరికొండ సురేష్, కోవూరు సురేష్ తదితరులు పాల్గొన్నారు



శివాజీ జయంత్యుత్సవం నేడు

నెల్లూరు(బృందావనం): ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంత్యుత్సవాన్ని నగరంలో బుధవారం నిర్వహించనున్నామని ఛత్రపతి శివాజీ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కాకు మురళీరెడ్డి పేర్కొన్నారు. వీఆర్సీ కూడలిలోని ఉత్సవ కమిటీ కార్యాలయంలో బ్యాడ్జీలను మంగళవారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. వైఎమ్సీఏ మైదానం నుంచి వివిధ ప్రాంతాల మీదుగా ప్రదర్శన జరగనుందని వివరించారు. ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి హర్షవర్ధన్, కన్వీనర్ అశోక్‌నాయుడు, కార్యదర్శి మధురెడ్డి, సభ్యులు సొల్లేటి వెంకటేశ్వర్లు, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.



బ్యాడ్జీలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

ఎంఐజీ లేఅవుట్లపై కలెక్టర్‌తో భేటీ

నెల్లూరు(అర్బన్): జాతీయ రహదారికి దగ్గర్లోని ప్రభుత్వ స్థలాలను గుర్తించి వాటిలో ఎంఐజీ లే అవుట్లను త్వరగా వేయనున్నామని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు కలెక్టర్ ఆనంద్‌ను ఆయన చాంబర్‌లో మంగళవారం కలిశారు. లేఅవుట్లలో పూర్తిస్థాయిలో మౌలిక వసతులను కల్పించేందుకు కృషి చేస్తామని కలెక్టర్ తెలిపారు. అనధికార లేఅవుట్లను గుర్తించేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్‌లను ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. నుడా సెక్రటరీ అల్లంపాటి పెంచలరెడ్డి పాల్గొన్నారు.

నకిలీ పట్టాలతో భూ ఆక్రమణ

నెల్లూరు సిటీ: నకిలీ పట్టాలను సృష్టించి భూ ఆక్రమణలకు టీడీపీ నేత పాల్పడుతున్నారని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఆలూరు తిరుపాల్ ఆరోపించారు. ఆమంచర్ల పంచాయతీ మట్టెంపాడులో విలేకరుల సమావేశంలో మంగళవారం ఆయన మాట్లాడారు. మట్టెంపాడులోని సర్వే నంబర్ మూడులో 500 ఎకరాల ఇనామ్ భూమి ఉందని చెప్పారు. ఇందులో 20 ఎకరాల్లో కంచెను ఏర్పాటు చేసుకొని దొంగ పట్టాలను సృష్టించి మధ్యలో మామిడి చెట్లను టీడీపీ నేత రాచమల్లు రమేష్ వేశారని ఆరోపించారు. 20 అడుగుల దారిని ఆక్రమించి పదెకరాల చుట్టూ ప్రహరీ నిర్మాణానికి యత్నిస్తున్నారని చెప్పారు. ఈ విషయమై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. నేతలు పొట్టేపాళెం చంద్రమౌళి, జనార్దన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం నేతలు

టీడీపీ మూకల దాడి దారుణం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): సీపీఐ నేతలపై టీడీపీ మూకలు దాడి చేయడం దుర్మార్గ చర్యగా సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో అభివర్ణించారు. వరికుంటపాడులోని అగ్రిగోల్డ్ భూముల్లో జామాయిల్ చెట్లను దొంగతనంగా నరికి అక్రమంగా తరలించిన విషయమై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన సీపీఐ నేతలు ముప్పాళ్ల నాగేశ్వరరావు, దామా అంకయ్య తదితరులను టీడీపీ మూకలు దుర్భాషలాడి దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. వీరిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

శివాజీకి కళావందనం

నెల్లూరు(బృందావనం): ఛత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకొని మూలాపేటకు చెందిన ఉపాధ్యాయుడు, కళాకారుడు గంధవళ్ల ఉమాశంకర్ కళావందనాన్ని సమర్పించారు. మర్రిఆకుపై శివాజీ మహరాజ్ చిత్రాన్ని తీర్చిదిద్దారు.



యూనియన్ బ్యాంక్ శాఖ ప్రారంభం

నెల్లూరు(సెంట్రల్): పడారుపల్లి సమీపంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నూతన శాఖను జనరల్ మేనేజర్ భాస్కర్‌రావు మంగళవారం ప్రారంభించారు. బ్యాంక్ రీజినల్ హెడ్ రాజశేఖరం, బ్రాంచ్ మేనేజర్ శైలజ తదితరులు పాల్గొన్నారు.



